International Journal of Academic Research
ISSN: 2348-7666 Vol.1 Issue-4 (1) (Special), October-December 2014

# ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహిత్యం - విశ్వజనీనత

డా॥ ఎం.విజయశ్రీ
HOD in Telugu, JKC College, Guntur - 6
vijayasreematta1@gmail.com

తెలుగు సాహిత్యంలో ఆచార్య కొలకలూరి ఇనాక్ గారికి ఒక ప్రత్యేకం ఉంది. ఎక్కడో మారుమూల గ్రామంలో పుట్టి, మట్టిలో మాణిక్యంలా ప్రకాశించి తెలుగు సాహిత్యంలో పసిడి కుసుమాలు పూయించిన సాహితీ దురంధరుడు ఇనాక్ గారు. ఎంతోమంది కవులు వచ్చినప్పటికి తన మనుగడను స్థిరపరచుకొనిన అపార మేధాసంపత్తి కలిగిన వ్యక్తి సాటిలేని మేటి ఇనాక్ గారు.

ఇనాక్ గారు కవిత్వం, కథలు, నవలలు, నాటకాలు, విమర్శలు, వ్యాసాలు, పుంఖాను పుంఖాలుగా రాశారు. అయన రచనల్లో అన్నిచోట్ల ఉంటూ వస్తున్న సాంఘిక, ఆర్థిక, రాజకీయ దోపిడి అయన వస్తువు. (1) ఇనాక్ గారు కూడా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఆ దోపిడిని చవిచూశారు. (2) సాహిత్యం, విద్య, పరిశోధన రంగాలకు సంబంధించి తనదైన విశిష్టపాత్రను నిర్వహించారు. అన్ని రంగాలలో కృషి చేసి సాహిత్యంతో సరస్వతీ మానస పుత్రుడని నిరూపించుకున్నరు ఇనాక్ గారు. (3) తెలుగు కథకు చైతన్యాన్ని, తిరుగుబాటు స్వభావాన్ని నేర్పిన రచయిత కొలకలూరి ఇనాక్ గారు. (4) ఆర్థిక అసమానత్వం, అస్థిర రాజకీయాలు, సాంఘిక పీడన, పలు ఉద్యమాలు, అపార ధనార్జన, వ్యష్టి కుటుంబస్థాపన, భూమి సంబంధాలు, స్త్రీల అవేదన వంటి సమస్యలు ఈయన కథావస్తువు.

ఇనాక్ గారు కులరీత్యా దళితుడు. బాల్యంలో పలుకష్టాలను అనుభవించారు. ఆ కష్టాలతో పాటు సమాజంలో ఉన్న కులవివక్షను అర్థం చేసుకున్నారు. పేదరికం నుంచి భేషజంలేని జీవితం గురించి అడంబర రహిత వాతావరణం నుండి పుట్టిన వారి కథల్లోని పాత్రలు వాస్తవిక జీవన చిత్రణతో పాటు రచయిత తాపత్రయాన్ని వ్యక్తం చేస్తాయి.

కొలకలూరి ఇనాక్ గారి రచనలో కొన్ని ప్రత్యేకతలున్నాయి. అవి (1) కొలకలూరి ఇనాక్ గారి దృష్టి ప్రధానంగా సమన్వయ దృష్టి. అందరిని సమానంగా చూస్తాడే గాని ఇతరుల వల్ల తమ కష్టాలు పడుతున్న వారికి మంచి చేయాలనే చూస్తారు. కాని వారిమీద పగ తీర్చుకోవడానికి చూడడు. దానికి ఉదాహరణంగా అస్పృశ్యగంగ అనే కథలో తనకు మంచినీళ్ళు దొరకకుండా చేసిన వారికి కూడా తాను త్రవ్వించే బావిలో నీళ్ళు పడితే వాటిని కుళాయిల ద్వారా హిందువుల కుటుంబాలకు, మిగిలిన వారికి ఇస్తానని తన భార్యతో అనేటప్పుడు ఇనాక్‌గారి సమన్వయ దృష్టి చక్కగా తెలుస్తుంది.

ఇనాక్ గారి కథల్లో ముగింపు ఆసక్తికరంగా, ఆశ్చర్యకరంగా, ఆలోచనాత్మకంగా, ప్రభోదాత్మకంగా ఉంటుంది. కథ చదివిన దగ్గరనుండి పాఠకునిలో ఉత్సుకతను రేకెత్తిస్తుంది. సమస్యనూ, దాని పరిష్కారాన్ని తెలుసుకోవడం కోసం మనస్సు పరిపరివిధాల పోతుంది. ఒక "సస్పెన్స్ థ్రిల్‌ను" అందిస్తుంది. పాఠకుడు ఏ కోణం నుంచి ఆలోచిస్తే ఆ కోణంలో సమాధానం దొరుకుతుంది. ఉదాహరణకు అస్పృశ్యగంగ కథలోని రెండు "కన్నీటిబొట్లు" అనే కథను చెప్పవచ్చు.

చాలామంది కథను చెప్పుకుంటూ పోతారు. గొప్పగా గొప్పకు పోతారు. కాని కొలకలూరి కథ చెప్పరు. కథలో ఏం జరుగుతుందో చెప్పరు. తానసలు కథలోకి ప్రవేశించరు. పాఠకుణ్ణి ప్రవేశపెడతారు. పఠకుడితో కథకు నాలుగో డైమెన్స్‌ని భాషింపచేస్తారు. ఉదాహరణకు రెండు 'కన్నీటిబొట్లు' అనే కథలో చివరికి ఏం జరిగింది చెప్పడు. రాముడు మాతమ్మ ఇద్దరూ బావిలో పడ్డారో, చనిపోయారో కూడా చెప్పరు. ఏం జరిగిందో చెప్పరు. పాఠకుడి ఆలోచనకు మాత్రమే వదిలివేస్తాడు.

కొలకలూరి వారి కథాశిల్పంలో ప్రాణభూతమైన లక్షణం చిన్నచిన్న వాక్యాలలో అతిశక్తివంతంగా కథను చెప్పడం, దీనికి ఉదాహరణ "అస్పృశ్యగంగ" కథలో వినాయక్‌ను గురించి చెబుతూ పెట్టె, సంచితో అనంతపురంలో రైలు దిగిన ఒకమనిషి పదేళ్ళలో ఆరుగురయ్యారు. బ్రతుకుమోయలేని సామానయ్యింది. కదపలేని యిల్లు అయ్యింది. తప్పులేని బావి అయ్యింది అనే మాటల్లో చిన్న చిన్న వాక్యాలే అతి శక్తివంతంగా చెప్పారు.

పై గుణాలను అన్ని పరిశీలిస్తే ఏ కవి రాయలేనంత గొప్పగా, అంబేద్కర్ భావజాలాన్ని పుణికిపుచ్చుకొని రచనలు చేయడంలో ఆయనకు ఆయనే సాటి.

ఇనాక్‌గారు మనస్సుకు హత్తుకునే విధంగా కథలు రాశారు. కాబట్టి అయన రచనలకు ఎన్నో బహుమతులు, బిరుదులు వచ్చాయి. ఆయనకు 1999 సం.లో జాతీయకవి, కళాసరస్వతి, ఉత్తమ ఉపాధ్యాయుడు, తెలుగు విశ్వవిద్యాలయ సాహిత్య అకాడమీ, విశిష్టమైన "పద్మశ్రీ" వంటి బిరుదులు ఆయనను వరించాయి.

సమస్యల తోరణంలా సాగిన ఇనాక్ జీవిత ప్రస్థావాన్ని పడిలేచే కెరటంలా నిత్యోత్సాహంతో జీవితంలోని ప్రతి మలుపును ఒక గెలుపుగా మార్చుకున్న రచయిత సమున్నత వ్యక్తిత్వాన్ని ఇంతింతై వటుడింతై అన్నచందంగా ఉన్నత పదవులు అధిరోహించిన వారి ఉద్యోగ జీవితాన్ని ఎదిగిన కొద్దీ ఉన్నత మనస్విగా ఒదిగిన వారి వినయశీలాన్ని, అపకారికి ఉపకారము చేసే వారి సౌజన్యాన్ని, విభిన్న ప్రక్రియలను చేపట్టే రచయితగా నాన్యతో దర్శనీయమైన ప్రతిభను ప్రదర్శించి సమకాలీన సారస్వత విహాయాశంలో ధ్రువనక్షత్రమై వెలుగు వేలార్చిన సాహితీ దురంధరుడు ఇనాక్ గారు. చిరకాలం ఇలాంటి రచనలు చేయాలని మనస్పూర్తిగా కోరుకుంటున్నాను.

అచార్య కొలకలూరి ఇనాక్ గారి రచనలలో ఎక్కువగా విశ్వజనీనత గోచరిస్తుంది. ఇనాక్ గారు చుక్కనీటి కోసం అగ్రవర్ణీకుల 'అరే, వోరే', మాటలతో నిత్యం అవమానింపబడే దళితులు మొదలుకొని 'ఒకే వోటు' కోసం ఏమైనా చేయగల రాజకీయ ధనవంతుల వరకు, బహిర్భూమిలో బతుకులు వెళ్ళమార్చే యనాదులు మొదలుకొని అమాయకుల్ని నడిరోడ్డులో హత్యచేసే పచ్చిరౌడీల వరకు ఎవరిని వదిలిపెట్టలేదు. చివరికి ఈదేశంలో ఇంకా బతికే వున్నావంటూ అప్పుడప్పుడు జరిగే సతిని రోడ్డు ప్రక్కన మేకల పాలై పోయే సర్కారు మొక్కల్ని, అంగుళం అంగుళం కలుషితమైపోతున్న గంగానది జలాలను సైతం వదిలి పెట్టలేదు. అందుకే ఇనాక్ ఒక స్థలానికి, ఒక కాలానికి చెందిన వ్యక్తి కాదు. ఆ హద్దుల్ని, సరిహద్దుల్ని దాటిన మహా రచయిత. ఆ చట్రంలో ఎదగని అసలు సిసలయిన జనం రచయిత.

డాక్టర్. కొలకలూరి కథానికలలో మనకు హరిజనులు, క్రైస్తవులు, మహమ్మదీయులు, వివిధ మతాల వాళ్ళు, కులాలవాళ్ళు ఎదురవుతారు. వృత్తి వ్యాపారాల దృష్ట్యా కావచ్చు. వైవిధ్యం మరింత దొడ్డది. గ్రామోద్యోగులు, పంతుళ్ళు, పోలీసులు, వెట్టివాండ్లు, పాలేళ్ళు, కూలీలు, ఎద్దుల బేరగాళ్ళు,

రిక్షావాళ్ళు, వర్తకులు, తోపుడుబండ్లపై వ్యాపారస్థులు ఇలా ఎన్నెన్నో వృత్తుల వాళ్ళకు అయన కథాలోకం నిలయమైంది.

కొలకలూరి రాసిన "ఊరబావి" కథ అటు వస్తుపరంగా, ఇటు శిల్పరంగా, గొప్ప పరిణామాల్ని సృష్టించిన కథ, దళితులు తమహక్కులు కావాలని అరిస్తే రావని, వాటిని హింసకు గురైనా సాధించుకోవాలన్నది ఈ కథ సారాంశం. ఊరబావి ఒక ఊటబావి. అనంతరం నీటి సమస్యతో ముడిపడిన దళిత కథలకు ఈ కథ మూలసూత్రం. తనను అవమానవించిన సవర్ణుని చెంప చెళ్ళుమనిపించడం, తన భర్తను, మామను హింసించి, బంధించిన మునసబుకు బుద్ధి చెప్పడం, ఎద్దు దట్టెంను ఊరబావిలో వేసి చివరికి ఆ బావిని దళితులకు స్వాధీనం చేసిన ఘనత చిదంబరం భార్యకు దక్కుతుంది. దళితుడికి, భూమికి మధ్య ఉన్న సంబంధాన్ని సూర్యుడు తలెత్తాడు కథ తెలియజేస్తుంది. స్వధాభరితమైన దళిత జీవితం నుండి విముక్తి పొందడం ఈ కథలో స్ఫురిస్తుంది.

దళితుడు ఆహార సంపదనలో పడే కష్టాలు "అకలి" కథ సారాంశం. "పశ్చాద్భూమి" పాకీ జీవితాన్ని చిత్రిస్తుంది. దళితులు తమ భయం వీడి, తమ అస్థిని తామే కాపాడుకోవాలని, సవర్ణులు మోసం చేస్తారని, వారి మోసానికి గురికావద్దని, తమ వృత్తిని దైవంగా భావించాలని, స్వశక్తితో బ్రతకమని, అలా బ్రతుకుతున్న వాళ్ళలో కులం పేరు చెప్పుకోగల సామర్థ్యం కలిగి జీవించమని ప్రబోధించాడు. అట్టడుగు జీవితాలను అతిమర్యంగా, సహజంగా, నిర్భయంగా, చిత్రించగలిగే సాహసం గొప్ప వ్యక్తిత్వాన్ని తెలుపుతుంది. ఈ కథానిక మునుపెన్నడు ఏ రచయితా పరికించని చోటును భద్రంగా, పవిత్రంగా, అక్షరసత్యంగా, వాస్తవికతా దర్శనంగా అందించిన ఆణిముత్యం.

సంస్కరణ దృక్పథం నేపథ్యంగా రాసిన దళిత కథ "సంస్కరణం" ఈ నేపథ్యంలోనే "ఎర్రినిళ్ళు", "ఏదీ గమ్యం" వంటి కథానికలు వస్తాయి. మతాన్ని పుచ్చుకున్న దళిక క్రైస్తవులు శాంతితో పాటు ఇతరులను ప్రేమించే గుణం ఉంటుందని, అందరూ దేవుని బిడ్డలుగా మెలగి దేవుని సూత్రాలకు నిబద్ధులై ఉంటారని "విష్‌యు ఏ హ్యాపీ క్రిస్మస్", "క్రిస్మస్ శుభాకాంక్షలు", "ఇదేం న్యాయం" వంటి కథలు కొలకలూరి రాశారు.

"పందిరిలేని తీగ" ఓ స్త్రీ సమస్య కథ, కథలో సుధారాణి అనాథ. తన జీవితంలో పలు అనుమానాలు చవిచూస్తుంది. తాను ప్రేమించే వ్యక్తిని వివాహమాడడం, అతని స్వార్థానికి గురికావడం, భార్యాభర్తలు విడిపోవడం, చివరికి ఆమె చనిపోవడం బాధగా చిత్రించాడు. సమస్యకు చావు పరిష్కారం కాదని ఈ కథల అంతరార్థం. ఈ కథల ద్వారా స్త్రీ చైతన్యాన్ని అకాంక్షించారు.

ఇలా ఎందరో కష్టజీవులు, నష్టజీవులు, కర్మజీవులు, ధర్మజీవులు, ఇనాక్ కథల నిండా కనిపిస్తారు. ఇనాక్ కథల్లో మధ్యతరగతి మందహాసాల మనస్తత్వాలు, వారి నీతి నియమాలు, జయాపజయాలు, ఆవేశాలు, ఆవేదన, విరసాలు, సరసాలు, భయాలు, భ్రాంతులు, సంకుచిత్వాలు, సంభ్రమాలు చిత్రింపబడినాయి. అంతకుమించి పల్లెజీవుల బాధల, గాధలు, కష్టాలు, కన్నీళ్ళు కళ్ళకు కట్టినట్లు చిత్రించారు.

పై విధంగా ఇనాక్ గారి కథలలో విశ్వజనీనతను చక్కగా చిత్రించారు.